## 3 ఆచంటేశ్వరుడు

ఇప్పు డే ప్రాంతం, మంచి మంచి పెద్ద పెద్ద మేడలు, మిద్దెలు, నాలుగిళ్ళ భవంతులు, సంవత్సరం పొడుగునా ఎకరం ముప్పందుంల కాడికి రాలే సారవా దాళవా భూములు, అడుగడుక్కీ వారం వారం సాగే పశువుల సంతలు, అపరదినుసుల బేర సారాలు, కలిగివుండి, కమ్మజనం తోటి కాపజనంతోటి కలకల్లాడుతూ వుందో ఆ ప్రాంత మొకప్పుడు చవిటి పఱ్ఱ. తిళ్ళ కర్ర, మడమోక మొలిచి ఎందుకూ పనికిరాని పెద్ద ఆవ; ఆ ఆవమ్మటే అక్కడక్కడ గట్లు, ఆ గట్ల మధ్యను గోదావరినది యొక్క యేడుపాయల స్వతస్సిద్ధపు వంకర టింకర పాఱుదల నీరు; ఆ నీటికి సముద్రపు ఎగపోటు, దిగుపాటు; అంతా అధ్వానం. అధ్వాన మంటే ఎవరికి? మనుష్యునికి. నదీ స్వరూపాని కది చక్కని చీర కట్టు! పాపికొండల లోయను సన్నని నడుముగా చేసికొని, అక్కడ నుండి క్రిందికి—రాజ్మహేంద్రవరం, కొవ్వూరు, వాడపల్లి, ధవళేశ్వరం మధ్యగల విస్తరింపును జఘన భాగంగా వినిర్మించుకొని, సమస్తమున్నూ కనబడకుండా సప్తసాగరాలు అనే అంచు అద్దిన ఒకానొక చీర కట్టుకుని, అమ్మహాసముద్రాన్ని గూర్చి పాడుకుంటూ పోతూవున్నదా అన్నదీమ తల్లి. ఆ చక్కని గోదావరి, అని అనుకోవలసిందే! మానవునియొక్క యుపయోగాధి భౌతికదృష్టిని వీడి కేవలం ప్రకృతి యోగిపరంగా

యోజిస్తే, ఆ విశాల భూభాగం ఎక్కడా మెట్ట మిట్టలు లేక, ఎక్కడా చిట్టి గులకరాయైనా కనబోక; అంతా మెత్తన మిలమిలామనే యిసక మేటనో, చిత్తడి జలజలా మనే ఒండ్రుమట్టినో చూపర చిత్త మాకర్షిస్తూ వుండేది.

లోక సంచారంగా బయల్దేరి ఒక సన్యాసి, సప్త సాగరాల అంచే చొల్లంగి నుంచి అంతర్వేది వఱకు పర్యటనం సమాప్తించుకొని, అక్కడ నుంచి గోదావరి యొక్క డాపలి వొడ్డే – ఇప్పుడు కోడేరు రేవు అని పిలువబడే – రేవు వరకు వచ్చేసరికి పడమటి దెస ప్రొద్దు క్రుంకుతూ వున్న సంగతి అతగానికి గోచరించింది. పొద్దు కుని కేసింది – ఉన్న వెలుగేమైనా వుంటే అది పొద్దు కునికిన వెనకా వతలి చిట్టెట్టి పొట్టెట్టి వెలుగే గాని సూర్యభగవానుని దనటాని కవకాశం తక్కువ.

నదికేసి చూచాడు సన్యాసి. నది మిక్కిలి శోభస్కరంగా వుంది. ఆకాశాన్ని అగపించే ప్రతీ మేఘంయొక్క ప్రతీ క్షణికపు మార్పున్నూ, రంగురంగుల కూర్పున్నూ ఆనీటిలో అందగిస్తూవున్నాయి. ఓరెండుమూడు నిమిషాలు ఆ ప్రకృతి విలాసంలో లీనుడై పోయాడు. ఆ రంగు చెంగులు – నీళ్ళల్లో నాని నాని దించుకు పొయ్యే చీర చెంగుల్లా–మటుమాయం గావ డాని క్కారణం యోజిస్తూ తిరిగి పడమటి దెసకు తన దృక్కు నుసికొలి పేడు. నభో వీధి యెల్లందనం కూడా అదో విధమైన కగ్గుదల కటికటి రూపం దాల్చివుంది. ఇఁక మింట చూడ్డానికేమీ లేనట్టు, అవని వంక తేటిపాటి చూచాడు. ఒండ్రులో దిగి పడమటి మార్గంగా వస్తూపోతూ వున్న మనిషి అడుగుల జాడలు సన్యాసి ముంగట అగపడ్డాయి. ఆశ్చర్య నిమగ్నుడైనాడు.

ఆ కనబడ్డ అడుగు జాడల్లో ఒక జాడనే, సన్యాసి, తనకుడికాలు
వేసేసరికి, తన యెడంకాలు ఆ ముందు నడచిన రెండవ జాడలో తనం
తటదే పడుతూ వుందా అన్నట్లు, సమాలోచనలేకుండా ఆ అడుగుల జాడ
లంటే వెళ్ళేడు. చీకటి పడింది. చీకటిపడ్డా, అడుగు జాడలకు సంబం
ధించిన లోతు వేతల ఎగుడు దిగుడుల తాకుడు కొంత పైని వొకానొక
చుక్క చటక్కన మెఱపు గోలిపేసోకుడు కాంతికొంత, ఆసన్యాసిని, కావ
లసిన గమ్యస్థానానికి చేరుస్తున్నాయి. క్రోసు క్రోసున్నర దూరం కడ
చనేటప్పటికి సన్యాసి కనుగొన్నాడు !

* * *

వట్రువయైచంటి యాకారంగా పైకి చొక్కియున్న యొక నల్ల
శానపు రాతిని. ఆ రాతిపై చూచు కాగ్రంబు ఫక్కి నిక్కియున్న కొసన
భంగు రమ్ముగు చెమరింపును, ఆ చెమరింపునే చెక్కు చెదరని, పూజ
నొక్కుమ్మడి మూగి ముమ్మరమ్ములై వాడని, నీరోడని, మన్మధబాణంబు
లనంబడే మఱు సొగసు పువ్వుల్నీ గాంచినాడు. ఆ దృశ్య మతని కవ
బోధనగా వించేటందుకు ఒరుడు నరుడున్న యలికిడిగా, నిట్టూర్పు పవనము
గాని లేదు. దైవ మాయగా తన కొఱ కేదో ప్రత్యక్ష సాక్షాత్కార
మైనట్టుప్పొంగి పోయినాడు. దాన్ని చూడ్డాని కా యతి కో కాగడా
కావాలని, ఒక వేగుచుక్క పొడవాలని, ఒక చందమామ యుద
యించాలని అనిపించలేదు. మనస్సాక్షి యొక్క అంతర్జ్యోతి తనంతన
కొడి దులుపుకొని, కొమరుమీఱీ, కొండంతదివ్వెగా ప్రజ్వలిస్తూవుంటే
పైవన్నీ యెందుకు ?

“ఇది లోకానికి వెల్లడి చేయవలెను. ఇది లోకానికి వెల్లడి

చేయవలెను." అని అంత మనిషైపోయినాడు. ఉత్తర క్షణమందే యోజించి "కాని, కాని" అని నసుక్కొని కుదుటిలోకంటా కుక్కుకు పోయినాడు. దివ్యదృష్టిగల సన్యాసే! అయితే మాత్రం—ఆంతరంగిక జ్యోతి దివ్యదృష్టి గుండా బాహిరదృశ్యం మీదికి ప్రసరించి యథార్థము ప్రకటించుటకు మాత్రం, క్షణంకాకున్నా క్షణంలో చిన్నంపాలైనా తీసికోకుండా వుంటుందా? ఉండదంటే ప్రత్యక్ష ప్రమాణ శాస్త్రాలు పదార్థ విజ్ఞాన సాధనాలూ కర్రుచ్చు కుంటాయి. తీసి కుంటుంది కూస్తో కాస్తో కాలం. ఆకాస్త యెడంలో "కాని, కాని," అని తోపించక మానదు. ఎంతటి మహా ప్రభావంగల వానికైనా — తిరిగి వితర్కించడం ప్రారంభించాడు సన్యాసి. "లోకానికి పాఠం నేర్పడానికి ఇక్కడ నాకో దృష్టాంతము దొఱికింది. స్తనాకృతినున్న యీ రాయి లోకమునం దెడతెగకుండా వుండే మోహాని కనశ్వరమైన తార్కాణము. అందునుండి అవిరళంగా వెలువడే యీ యుదకం మోహం తెచ్చిపెట్టే శోకాశ్రువులు. శోకాశ్రువులు ఇది లోకానికి ప్రకటిస్తే నే చెప్పబోయే పాఠం నా గొంతుకొట్టే నొప్పిలేకుండా బోధ పఱచడాని కవకాశం వుంటుంది" అని సిద్ధాంతీకరించుకొన్నాడు. "కాని, కాని," అనుకొన్నాడు పెరఘడియ. ఒంగుని మూర్కొన్న మాదిరిగ నతని మోము వంచాడా రాతి మీదికి. ఆవిరి పైకి వచ్చినట్లుంది. పూలు వాడిలేవు. ఆవిరి వస్తూంది. ఇంకనూ సన్యాసి కాశ్చర్యం మెండై గుండె లదిరించి వేస్తూంది. "ఆవిరి పైకి వెలిబుచ్చే యీ నీరు దుఃఖ బాష్పమే, ఆనంద బాష్పం కానేరదు. "కాని, కాని," అని అను కొన్నాడు. లోపలి సందేహం పైకి వెలిబుచ్చ లేకుండా వున్నాడు. "కాని, కాని," అని యూరకుంటూ వచ్చినాడు. కొంత వడికి ప్రకృతి యతగానికి తోడై "నీ సందేహం ఏమిటి?" అని అడిగినట్లయింది.

సన్యాసి కింక జవాబు చెప్పడం తప్పింది కాదు. "ఈ దుఃఖ బాష్పాల నర్చించడమేమిటి? ఒత్తివేయాలి గాని. ఈ వేడికన్నీటిపైని యీపువ్వులు వాడక పోవడమేమిటి? యీ పాటి కుడుకెత్తి మగ్గి బుగ్గైపోవలసినవి కాని!" అన్నాడు సన్యాసి. ప్రకృతిదేవి మూకీ భావము వహించింది. "నీ సందేహ మేమిటి?" అని అడిగి సన్యాసి సందేహం తాను తెలుసుకుందే కాని సన్యాసి సందేహం తీర్చలే —

* * *

సన్యాసి ఆ రాతి చెమరింపుమీది ఆ జిలుగు పువ్వుల్ని తీసివేసి, ఆయుదకాన్నంతనూ తన యొక్క కట్టుడు కాషాయ వస్త్రపు గొనతో అద్ది, — అద్దినా ఆ మొద్దురాయి తిరిగీ చెమరించడం గ్రహించి, కొస నొక మొన వత్తిగా జేసి, ఆ సన్నని వత్తి ముంచి దించి, నీ రెంత వచ్చినా ఎగబీల్చేటట్లుంచి, లోకం యొక్క శోకం నిశ్శేషంగా బాపుతానని కంకణం కట్టి కొన్న పొంకర బింకం కొద్దీ కృషి సలిపేడు.

ఆ కృషిలో అతని కనులు కామిర్లు కమ్మినట్లయి పోవడం ప్రారంభించినాయి. లోపలి అసలు సొంత దివ్వె అంతరిస్తూన్నట్లు గోచరించింది. కాని చూపున్నంతమట్టులో, ఏమాత్రమున్న ఆ మాత్రం తోనే ఆ పొసగించిన వత్తినే చూస్తున్నాడు. తన కాషాయ వస్త్రపు రంగుకంటె నెక్కుడెట్టిందనంతో ఆర్ద్రిమై నెత్తురు, తన గుడ్డవత్తినే తన కాషాయవస్త్రాన్ని అంటుకొన్నట్లు దోచింది. గుడ్డ తీసివేసి తిరిగి పువ్వు లెప్పట్లా పరవాలని అనుకొన్నాడు. కాని నెత్తురు కనబడ్డంతోనే పెట్టిన గుడ్డ పెట్టినట్టుగా ఉండిపోయి, తన చేయి వశం తప్పింది. కను లత

గానివి పూర్తిగా పొడిచేసినట్లుండీ, ఎందుకూ కొఱగాని గుడ్డికళ్ళయి పోయినాయి. తుదకా సన్యాసి "శంకరా! శంభో! తెల్లవారలేదా? తెల్లవారలేదా?" అని అడిగి వేడుకోవలసి వచ్చింది.

పోనీ అని తడుముళ్ళాట నేదని తెలిసికొందామనుకున్నాడు గాని అప్పటి కప్పుడే, అతడు చూచిన ఆ దృశ్యాన్ని బట్టి, అతణ్ణి బట్టి, చుట్టి, ఒక పెద్ద ఆలయం ఏర్పడిపోయింది. ఆ ఆలయంలో ఒక స్త్రీ గొంతు "తెల్లారినట్లుంది" అని అన్నట్లైంది. ఒక పురుషుని గొంతు "నిన్ను నే గోల్పోలేదా? నీవు సజీవివై యున్నావా?" అన్నట్లయింది. "నా స్తనా గ్రమ్మీద నీచేయివేసి నన్నర్చించిన నీ యమృత శక్తిచే బ్రతికియున్నాను. మృతినందలేదు" అంది స్త్రీ.

సన్యాసి ఆ సంభాషణ ఆలకించి "ఆహా! వీరు వీరోడ్చిన దుఃఖాశ్రువులను గురించిగాని, వీరు తమపైని గప్పికొన్న పువ్వుల మొత్తాన్ని గురించి గాని ఎఱుగనే ఎఱుగరు! అమృతశక్తి పరవశులైన వీరెవ్వరో? చూడ నుత్సహిస్తున్నాను. దయామయా! శంకరా! నా కళ్ళు నాకిమ్ము!" అని భగవంతుని గురించి తలపోసినాడు. దేవుడు కను లిచ్చాడు.

సన్యాసి కన్నులు విప్పి చూచేలో ఆ ఆలయానికో పూజారి సృజింపబడి ఆ పూజారి గుడి తలుపులు తెరుస్తున్నాడు. పూజారి గుడి తలుపులు తెరచేలో, సన్యాసి తిరోహితుడైనాడు.

పూజారి కనుగొన్న దొక నల్ల శానపు రాతి లింగం. లింగ ముఖాన్ని రెండు బొత్తలు, బొత్తలంట ఎప్పుడూ ఎండిపోని జలం వుబుకు.

మఱి అదంతా దైవ మాయగా దలపోసి పూజారి నిత్యాభిషేకంతో ఆ లింగ మర్చిస్తూ, నాడు గొబ్బిపూలతో అయితే, నేడు గులాబి పూలతో పూజ చేస్తూవున్నాడు.

తమ సోమాజ్యోతిర్గ మయ ! మృత్యోర్మా మమృతంగ మయ ! !

---

| రచన | స్ఫురణ | తొలి ప్రకటనము |
| --- | --- | --- |
| 7—12—1930 | అచంట | "సుధ" లో |